

సాగరతీరం.. ఆహ్లాదకరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర, ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు.



స్నానాలు చేస్తున్న పర్యాటకులు

రొయ్య ధర పతనం..!

- పెరిగిన పెట్టుబడులు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- నష్టాల ఊబిలో ఆక్వా రైతులు



పట్టుబడి చేసిన రొయ్యలు



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వారంగం ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతోంది. అయితే ఆక్వా రంగానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ లేకపోయినా మొదటి నుంచి రైతులే కష్టనష్టాలను ఎదుర్కొని సాగు చేస్తున్నారు. ఆక్వా అభివృద్ధికి ప్రభుత్వం నామమాత్రంగానే చర్యలు తీసుకుంటోంది. నాలుగేళ్లుగా రొయ్యల మేత ధరలు పెరుగుతుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తులు సాధిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా నాయకులకు పట్టడం లేదు. వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వసతుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక వారు నష్టాలపాలవుతున్నారు.

మార్కెట్లో ధరలు పతనం కావడంతో రొయ్యల సాగు చేసిన రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వంద కౌంట్ ధర కిలో రూ.180లకు పడిపోయింది. అంతర్జాతీయంగా ఆర్డర్లు లేవని పెద్ద కౌంట్‌ను కొనుగోలు చేసేవారు లేకుండా పోయారు. కొనుగోలుదారులను బతిమలాడి విక్రయించాల్సిన దుస్థితి ఎదురవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యాపారులు, ప్లాంట్ యజమానులు కుమ్మక్కై ధరలు మరింత తగ్గించారని వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి.

ఆక్వా సాగుతో పాటు ఎగుమతుల్లో ఎప్పుడూ ముందుండే పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుతం ఆక్వారంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పెరుగుతున్న ఖర్చులు.. పతనమవుతున్న రొయ్యల ధరలు.. మరో వైపు వైరస్ ఆక్వా రైతుపై ముప్పేట దాడి చేస్తున్నాయి. ప్రస్తుత గడ్డు పరిస్థితిలో రైతులు రొయ్యల సాగు కంటే చేపల పెంపకమే మేలనే నిర్ణయానికి రైతులు వస్తున్నారు.

ఆక్వాసాగులో అధిక దిగుబడులు సాధిస్తూ.. ఎగుమతుల్లో మొదటి స్థానంలో ఉండే పశ్చిమగోదావరి జిల్లా రైతులు ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రొయ్యల దిగుబడులు వేసవిలో ఆశాజనంగా ఉంటాయని రైతులు భావిస్తుంటారు. అందుకు తగ్గట్టే ఈ సీజన్లో ఎక్కువ మంది రైతులు రొయ్యల సాగుకు ఉపక్రమిస్తుంటారు.

ఈ ఏడాది భిన్నమైన పరిస్థితులు...

అయితే ఈ ఏడాది సీజన్లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మే మొదటి వారంలో కురిసిన అకాల వర్షాలు రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. పగలంతా ఎండ, తరువాత చెదురుమదురు వర్షాలతో చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. జోన్ల పేరుతో విద్యుత్ సబ్సిడీని ప్రభుత్వం తొలగించడం ఆక్వా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

గతంలో ఎకరా రొయ్యల చెరువు సాగుచేస్తే 4 నుంచి 5 వేల రూపాయల విద్యుత్ బిల్లులు చెల్లించగా ఇప్పుడు రూ.10 వేల నుంచి 13 వేల రూపాయలకు పెరిగింది. మరోవైపు మేత ధరలు సగటున కిలోకు 27 రూపాయలకు పైగా పెరిగాయి.

సగటున తగ్గిన రొయ్య ధర రూ.75

వారం క్రితం వంద కౌంట్ వనామీ రొయ్య ధర రూ.250 ఉండగా మార్కెట్లో ప్రస్తుతం రొయ్య ధర రూ.180లకు పడిపోయింది. రైతుకు వంద కౌంట్ కిలో ఉత్పత్తికి రూ.240లకు పైగా ఖర్చవుతోంది. తాజా ధర ప్రకారం కిలో రూ.60 నష్టానికి విక్రయించాల్సి వస్తుంది. మిగతా కౌంట్ రొయ్య ధరలు కూడా తగ్గాయి. రానున్న రోజుల్లో మరింత పతనమవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోళ్లు ఆపిన ప్రాసెసింగ్ ప్లాంట్లు..

విదేశాలకు ఎగుమతిదారుల నుంచి కొత్త ఆర్డర్లు లేవని ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులు రొయ్యల కొనుగోలు తగ్గించారు. సాధారణంగా మే, జూన్‌లో ధరలు తగ్గినా జులై నుంచి పెరుగుతాయి. పరిస్థితులను అవకాశంగా తీసుకుని కొందరు నిర్వాహకులు, వ్యాపారులు కుమ్మక్కై త్వరలో కోత విధించారు. గత నవంబర్‌లో వంద కౌంటు రొయ్య ధర రూ.180కు పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని రూ.230లకు కొనాలని వ్యాపారులను ఆదేశించింది. ధరల అమలు పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలను నియమించారు. వ్యాపారుల ఒత్తిడితో దిగివచ్చి వంద కౌంట్ కనీస ధర రూ.210గా ప్రకటించారు. ప్రస్తుతం ఆ ధర కూడా అమలు కాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రొయ్య రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు విద్యుత్ రాయితీ కల్పించాలని కోరుతున్నారు.

నష్టాలే మిగులుతున్నాయి..

అడ్డాల నాగరాజు, ఆక్వా రైతు, కాళ్లకూరు



ప్రస్తుతం పంట ఉంది. వంద కౌంట్ రొయ్య కిలో ధర రూ.180లకు తగ్గిపోయింది. మేత, మందులు, కూలీల ధరలు తదితర పెట్టుబడులు బాగా పెరిగాయి. ఇప్పటివరకూ రొయ్యల ధరలు మాత్రం పెరగలేదు. రూ.59 లక్షలపైనే పెట్టుబడి పెట్టాను. కౌంట్‌కు వచ్చిన రొయ్యలను పట్టుబడి చేస్తున్నాను. నష్టాలే మిగులుతున్నాయి.

అర్జీల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్నకు చెబుదాం ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పూర్తి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం తెలిపారు. జిల్లాలో జెకెసి ద్వారా మే 9 నుంచి మొత్తం 4,932 అర్జీలు రాగా, ఇప్పటివరకూ 3,685 అర్జీలు పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన 919 అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. జెకెసి ద్వారా ఎక్కువగా ఎలక్ట్రిసిటీ లోఓల్టేజీ, ఆర్ఒఆర్, పోలీస్, శానిటేషన్, తాగునీటి సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. అర్జీల పరిష్కారమైన తర్వాత అర్జీదారునికి ఫోన్‌చేసి సమస్య పరిష్కారం విధానంపై కూడా వివరాలు అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. అర్జీదారుడు సంతృప్తి చెందకపోతే రీఓపెన్ చేసి అర్జీని సమీక్షిస్తామని తెలిపారు. అర్జీదారునికి మేలైన పరిష్కారం చూపడంలో సంబంధిత శాఖల అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడమే జెకెసి లక్ష్యం అని జిల్లా కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి



మోషేనురాజుకు వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

గెస్ట్ లెక్చరర్లను కాంట్రాక్టు విధానంలో చేర్చండి

శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజుకు వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

ఏళ్ల తరబడి అతిథి అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్)గా ఉండిపోయిన తమ బతుకుల్లో వెలుగు చూపించాలని, తమను కనీసం కాంట్రాక్టు విధానంలో చేర్చాలని కోరుతూ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజుకు గెస్ట్ లెక్చరర్లు వినతిపత్రం అందజేశారు. దుంపగడప ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఆదివారం భీమవరం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలను వివరించారు. గంటల ప్రాతిపదికన జీతం పొందుతున్నా, పని మాత్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ తెలిపారు. అయితే బోధన సమయానికి సంబంధించి మాత్రమే జీతం వస్తోందని తెలిపారు. పూర్తిస్థాయిలో పనిచేస్తున్న తమను కనీసం కాంట్రాక్టు విధానంలోనైనా తీసుకోవాలని కోరారు. దీనిపై మోషనురాజు సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వ కళాశాల పనితీరును స్వయంగా తెలుసుకుంటానని తెలిపారని తెలిపారు. తమ ప్రభుత్వం చిరు ఉద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్సకు వివరించి, సిఎం దృష్టికి కూడా తీసుకెళ్తానని భరోసా ఇచ్చారని గెస్ట్ లెక్చరర్లు బాలు, సంజీవరాజు తెలిపారు.

గూడెం చేరిన రఘునాధం మృతదేహం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అమర్నాధ్ యాత్రలో మృతి చెందిన తూనుగుంట్ల రఘునాధం మృతదేహాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో స్థానిక 17వ వార్డులోని మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. వైసిపి యువ నేత కొట్టు విశాల్ మతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఉండి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర ఆదివారం ఏడో రోజుకు ఉండి మీదుగా మహదేవపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడారంగంలో జాతీయ స్థాయిలో సత్తాచాటే విద్యార్థులు చాలా మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం వీరిపై దృష్టి సారించి తగు శిక్షణ ఇస్తే 100 మంది విద్యార్థుల్లో ఇద్దరు జాతీయస్థాయిలో రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇ.వాసు, ఉపాధ్యక్షులు టి.ప్రసాద్ నాయకులు సందీప్, దిలీప్, నాగేంద్ర కుమార్, గణేష్, మౌనిక, సలోమీ, మరియమ్మ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



యాత్రలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఒపిఎస్ అమలయ్యే వరకూ పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకూ పోరాటం సాగిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు పిఎస్.విషయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో సిపిఎస్ రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి పాత పెన్షన్‌ను అమలు చేయలేదని విమర్శించారు. జిపిఎస్ ఇస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని ఒపిఎస్ మాత్రమేనని తెలిపారు. ఒపిఎస్ సాధించే వరకూ పోరాటం సాగిస్తామన్నారు. 117 జిఒ వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని, ఈ జిఒను రద్దు చేసి



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిటీని నియమించి చేతులు దులుపుకుంటే సరిపోదని ఇంటిరియలు రిలీఫ్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అక్రమ బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, రిఅపార్ట్‌మెంట్ వల్ల జీతాలు రాక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తక్షణం జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. ఫ్యాఫ్టో ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 మండల కేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శులు జయకుమార్, రత్న రాజు, శివప్రసాద్, రామకృష్ణంరాజు, రామకృష్ణ ప్రసాద్, కుమార్ బాబ్జి, శ్రీనుబాబు, ఏసుబాబు, సాయిరాం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు, నాయకులు బంకురు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని, ఒక కిలో టమోటాలు 140 రూపాయలు పైనే అమ్ముతున్నారని తెలిపారు. పచ్చిమిర్చి 150 రూపాయలు, అల్లం 270 రూపాయలు ఇక మిగిలిన కూరగాయలు ధరలు సరాసరి పెరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల ముందు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వాలు నేటికీ స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బియ్యం తప్ప ఏవీ రేషన్ కార్డుపై ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలను తగ్గించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పేదల గుండెల్లో చిరస్థాయిగా రామకృష్ణ : సిపిఎం

ప్రజాశక్తి - ఆచంట

పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజా నాయకుడు, వల్లూరు మాజీ సర్పంచి చిట్టూరి రామకృష్ణ ధన్యజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. చిట్టూరి రామకృష్ణ 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం వల్లూరు సెంటర్లోని చిట్టూరి రామకృష్ణ స్తూపం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత రామకృష్ణ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు, తోటపల్లి సత్యన్నారాయణ చిట్టూరి రామకృష్ణ స్తూపం వద్ద కేతా గోపాలన్, రామకష్ణ కుమారుడు చిట్టూరి రాంబాబు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్తూపం వద్ద సీనియర్ నాయకులు బొర్రా ధర్మారావు సిపిఎం పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో కేతా గోపాలన్ మాట్లాడుతూ వల్లూరులో ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించడంలో రామకృష్ణ ముందుండేవారని తెలిపారు. గ్రామ సర్పంచిగా పనిచేసిన సమయంలో ఎటువంటి అవినీతి, బంధుప్రీతి లేకుండా నిష్కళంకంగా గ్రామ ప్రజలకు సేవలందించారని కొనియాడారు. 1986 వరదల్లోనూ, 1996 తుపాన్ సమయాల్లోనూ గ్రామస్తులందరినీ ఏకంచేసి తుపాన్ బాధితులకు అందించిన సేవలు మరువరానివని కీర్తించారు. రామకృష్ణ ఆశయ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై అలుపెరగకుండా పోరాడడమే వారికిచ్చే ఘననివాళి అని గోపాలన్ అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్ శర్మ, సిర్రా నర్సింహమూర్తి, నేదూరి హనుమంతరావు, వారణాసి పార్థసారధి, పంది అప్పారావు, తాళం సుబ్బారావు, జవజాల దుర్గారావు, కమిడి ఉమామహేశ్వరరావు, బొర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వల్లూరులో చిట్టూరి రామకృష్ణ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రతి ఇంటికీ రక్షిత నీరు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి పల్లెలోనూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్. నరసింహరాజు అన్నారు. దొడ్డనపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఆదివారం నిర్వహించారు. జల జీవన్ మిషన్ ద్వారా రూ.66 లక్షలతో కచ్చా గరువు, డ్రెయిన్ పక్కన ప్రాంతాల్లో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. జెడ్‌పిటిసి నిధులు రూ.5 లక్షలు, ఎంపిపి నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను పివిఎల్ నరసింహరాజు ప్రారంభించి మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో జల జీవన్ మిషన్‌లో ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జల జీవన్ మిషన్ ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడుతున్నామన్నారు. అభివృద్ధిలో పార్టీలు ఉండవని, అందరూ సమిష్టిగా గ్రామాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. రాబోయే రోజుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. దొడ్డనపూడి గ్రామానికి కోటీ పది లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), ఎంపిటిసి కాశీ, సత్యనారాయణ, వైసిపి గ్రామ అధ్యక్షులు గుండా సాయి బాబా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

20 నుంచి మున్సిపల్ కార్మికుల దశలవారీ ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని(ఆప్కాస్) పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ ఆటోల డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల 20వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపును జిల్లాలో జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించింది. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం వినుకొండ రమేష్ అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశం వివరాలను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు పత్రికలకు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద మహిళా కార్మికులు రిలే నిరాహార దీక్షలు, 21వ తేదీన అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పురుష కార్మికుల రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ నెల 27వ తేదీన రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాలు ముట్టడించాలని, వచ్చేనెల ఏడో తేదీన జిల్లా కలెక్టరేట్లు ముట్టడించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపును జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపాలిటీల్లో జయప్రదం చేయాలని సమావేశం నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15వ తేదీ తర్వాత రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపట్టాలని, దానికి కార్మిక వర్గమంతా సన్నద్ధం కావాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ 2019 ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని, మున్సిపల్ కార్మికులను నట్టేట ముంచారని విమర్శించారు. రాబోయే ఎన్నికలకు ముందైనా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు కార్పొరేషన్లకు చెందిన యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ విభాగాల నాయకులు కారు దుర్గారావు, వీరంకి సాయిబాబు, బి.ఆంజనేయులు, ఎస్.శివకృష్ణ, కె.నాగరాజు, విజయకుమార్, డి.రాజు, వెంకటేష్, దిలీప్, వెలగాడి పద్మ, ఎం.కమల కుమారి, మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో మున్సిపల్ సిపిఎస్ ఉద్యోగులు, కార్మికులు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగులు, క్లాప్ ఆటోల డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. చింతలపూడి మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, హెల్త్ అలవెన్సులు అమలు చేయాలని సమావేశం కోరింది. జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న మూడు నెలల హెల్త్ అలవెన్స్‌లు వెంటనే విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసింది.

కీచక వ్యాయామోపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణపై విచారణ అధికారులు విచారణ జరిపిన తమ నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. ఈ మేరకు నిందితుడు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావుపై శాఖాపరమైన చర్యలకు డిఇఒ వెంకటరమణ చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా అతడిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లుగా ఉప విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అదే సమయంలో అతనిపై పోక్సో చట్టం ప్రకారం పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు ఇరువురికి ఆదివారం ఆదేశాలందాయి. ఈ ఆదేశాలను డిఇఒ వెంకటరమణ పత్రికలకు విడుదల చేశారు. దీనిలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యసాయి తెలిపారు.

చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో యువజన విభాగం జిల్లా అధ్యక్షులను త్వరలో నియామకం చేస్తామని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించాలని తెలిపారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దేయకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో తెలుగు పద్యాల పోటీలు, ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షులు ఆదివారం నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం కో-ఆర్డినేటర్ కెవి.కృష్ణారావు మాట్లాడుతూ పెద్ద పెద్ద మేధావులు కూడా హాస్టల్లో ఉండి చదువుకునే చరిత్ర సాధించారన్నారు. ప్రభుత్వాలు బాలికల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించాలని, ఎంతో ఖర్చుతో హాస్టల్స్‌ను నడుపుతున్నారని చెప్పారు. వీటికి స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించడం అభినందనీయమన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్స్‌లో బాలికలు ఎంతో ఉత్సాహంగా చదువుకుంటున్నారన్నారు. ఇదే హాస్టల్స్ నుంచి పలువురు ప్రతిభావంతులుగా గుర్తింపబడ్డారన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించి కెవి.కృష్ణారావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు సహకారంతో 60 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉండపల్లి రమేష్‌నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాస్, గంటా సుందరకుమార్, కొంగ్ర శ్రీనివాస్, కె.శిరీష, వార్డెన్ జి.శ్యామల పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న రహదారి

అధ్వానంగా రహదారి
ప్రయాణికుల అవస్థలు పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని ప్రధానమైన ఆచంట కచేరి సెంటర్ నుంచి వేమవరం వెళ్లే ఆర్అండ్‌బి రహదారి సుమారు ఆరు కిలోమీటర్ల వరకు పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకుంది. ఈ రహదారిపై ప్రయాణించేందుకు వాహనదారులు, ప్రయాణికులు భయపడుతున్నారు. ప్రభుత్వాలు మారినా రహదారి బాగుపడడంలేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో వర్షం వస్తే ఆ గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి సుమారు అరగంట సమయం పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిపై దృష్టి సారించి రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

87 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కడకట్లలోని జనతా ఛారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. పడాల మహేశ్వరరావు కుమారుల ఆర్థిక సహకారంతో 87 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం తొమ్మిది మందిని నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాలకు పంపించారు. 22 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేరూరి కాశియ్య, వంగపండు రామమోహనరావు, చిన్నం జగదీష్, జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మహాదేవపట్నం గ్రామంలోని మహంకాలమ్మ ఆలయం వెనుక కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు, ఎస్ఇబి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,220 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.గంగాధరరావు మాట్లాడుతూ మండలంలో జూద క్రీడలను ప్రోత్సహించిన, నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో సాంకేతిక ప్రదర్శన

ప్రజాశక్తి - ఉండి

వివిధ రకాల పంటల సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు కృషి విజ్ఞాన కేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఏర్పడి ఆదివారానికి 95 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ భారతదేశంలో సుమారు 700 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని ఏ ప్రాంతానికి అనుకూలమైన పంటల గురించి ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించనున్నట్లు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు, మహిళలకు, యువకులకు వృత్తి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి వారి స్వయం ఉపాధికి బాటలు వేసేందుకు శాస్త్రవేత్తలు ఉన్నట్లు వారు తెలిపారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపక గురించి శిక్షణ తరగతులను ప్రారంభించామని తెలిపారు. ఈ పుట్టగొడుగుల్లో అనేక రకాలు ఉన్నాయని, వీటిలో పాల, ఆయిస్టర్ పుట్టగొడుగులు పెంపకానికి అణువైనవని వారు తెలిపారు. ఈ పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి గలవారు కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి వారికి కావాల్సిన సాంకేతిక సలహాలు పొందాలని వారు తెలిపారు.



సాంకేతిక ప్రదర్శనలో శాస్త్రవేత్తలు, మహిళలు, విద్యార్థులు

అనంతరం క్షేత్ర సందర్శనతో పాటు డ్రోన్ టెక్నాలజీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.డెబోరా మెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ పి.వినయలక్ష్మి, బి.రజితారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.


దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు


దాట్ల వెంకటరామరాజును సత్కరిస్తున్న పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల


జన్మభూమి మీద మమకారంతో కాళ్లకూరు గ్రామంలో దాట్ల వెంకటరామరాజు తన కుమార్తె పేరు మీద దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సహాయ నిధులు ద్వారా సుమారు రూ.13 లక్షలతో శ్రీ వెంకటేశ్వర పద్మావతి కోనేరుచెరువులో పూడిక తీత పనులను, మూడు రేవులను, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పివిఎల్.నరసింహరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ట్రస్ట్ ద్వారా శ్మశానవాటిక ఇతర అభివృద్ధి పనులను రూ.30 లక్షలతో చేపట్టారన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధితో పాటు కొంతమంది మంచి మనసున్న దాతలు తమ సొంత గ్రామాభివృద్ధికి తోడ్పడితే ప్రజలకు సౌకర్యాలు ఏర్పడతాయన్నారు. వెంకటేశ్వర స్వామి వారికి, రామాలయంలో పూజలు నిర్వహించే అర్చకులు, భక్తులకు ఈ రేవుల నుంచి నీటిని నిత్యం తీసుకెళ్తుంటారు. ఈ రేవులు ఎంతో ఉపయోగంగా ఉన్నాయన్నారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. పివిఎల్.నరసింహరాజు చేతులమీదుగా ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకటరామరాజును సత్కరించారు. కాళ్లకూరు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు పివిఎల్.నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, గ్రామ సర్పంచి సాధు శ్రీదేవి, సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు మాధు సురేష్, కాళ్లకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు బొర్రా వెంకట సత్యనారాయణ, వేగేశ్న విజయరామరాజు, వీరమల్లు రామారావు, కట్టా సతీష్, చిటికెన సూర్యనారాయణ, కట్టా బాబ్జి, కోలా ఆంజనేయులు, చిటికెన లక్ష్మణరావు, కట్టా పెద్దిరాజు, గణపతి పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

మెగా జాబ్ మేళాలో 632 మందికి ఉద్యోగాలు

పాలకొల్లు :పాలకొల్లు ఛాంబర్స్ కళాశాల, ఇంపాక్ట్ హెచ్‌ఆర్ సౌజన్యంతో కాలేజీలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇసి మెంబర్ డాక్టర్ బి.జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. జాబ్‌మేళాకు పెద్దఎత్తున స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని చెప్పారు. మొత్తం 18 కంపెనీల నుంచి విచ్చేసిన హెచ్‌ఆర్‌లు అభ్యర్థులను రాత పరీక్షలు, టెక్నికల్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 632 అభ్యర్థులను ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక సెమీ అర్బన్ ప్రాంతమైన పాలకొల్లుకు తీసుకొచ్చి జిల్లా వాసులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో ఛాంబర్స్ కళాశాల ముందు వరుసలో ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో మెగా జాబ్ మేళా నిర్వహించడం ఛాంబర్స్ కళాశాల మిగతా కళాశాలకు ఒక ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. విద్యతోపాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు ప్రతి కళాశాల కృషి చేయాలని, విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్ వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఎంపికైన 632 అభ్యర్థుల్లో 147 మంది అభ్యర్థులు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఉన్నారని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు తెలిపారు.

30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల విరాళాలతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆదివారం కాళ్ల హైస్కూల్ పూర్వ విద్యార్థులు (1992-1993) హైస్కూల్లో కలిసి తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత గెట్ టు గెదర్ ఏర్పాటు చేసిన కాళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమపై కురిపించిన ఆప్యాయతతో 80 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయులు ఉప్పొంగిపోయారు. దేశ, విదేశాల్లో వివిధ వృత్తులు, వ్యాపారులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవం జీవితాంతం ఉంటుందని విద్యార్థులు అన్నారు. సుమారు 160 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ఒక వేదిక పైకి పాఠశాలలో కలిసి చదువు చెప్పిన గురువులను సత్కరించారు. చాలా మంది పూర్వపు విద్యార్థులు సతీ సమేతంగా మరి కొంతమంది భర్తలతో కలిసి వచ్చారు. విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. విద్య నేర్పిన పాఠశాలకు విద్యుత్తు, వైఫై, కుర్చీలు వంటి సౌకర్యాలు నిమిత్తం రూ.60వేలు అందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

తాగునీటి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. విస్సాకోడేరు పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు పలు సమస్యలు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీనిలో భాగంగా ఆదివారం ఎంఎల్ఎ రామరాజు భగత్ సింగ్ నగర్ వెళ్లి అక్కడ సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు తాగునీటి, విద్యుత్ సమస్యలను ఎంఎల్ఎకు విన్నవించడంతో ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ రామరాజు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఇళ్ల చినసత్యనారాయణ (పండు), మండల ఉపాధ్యక్షులు నడిపూడి వెంకటఅప్పారావు, నాయకులు ఆరేపల్లి నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో జరిగే ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల రాష్ట్రస్థాయి అండర్ 14కు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఆదివారం మార్టేరు ఎస్‌విజిహెచ్ గ్రౌండ్ ఆవరణలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. చింతకాయల సత్యనారాయణ (తాడేపల్లిగూడెం), గవ్వ శ్రీనివాస్ (ఏలూరు), కర్రి వినాయక రెడ్డి (మార్టేరు) ఎంపిక కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. ఆయా మండలాల నుంచి పి.సాయిసత్యవంశీ, చార్లెస్ వెస్లీ (కొవ్వలి), ఎస్ఎస్‌సి సాయిమణికంఠ (తాడేపల్లిగూడెం), పి.రాఘవేంద్రరెడ్డి, ఎం.రామతేజ (మార్టేరు), అఖిల్ (ఏలూరు), శంకర్ రెడ్డి (మార్టేరు), ఎం.ఇనోష్ (కవ్వాలి), జె.వేదాంత్ (తాడేపల్లిగూడెం), బి.సాయి మణికంఠ (దేవరపల్లి), కె.సందీప్ (ఏలూరు), పి.కిరణ్‌కుమార్ (మార్టేరు) ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సిఎస్ఎన్.రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా కార్యదర్శి మహమ్మద్ హుద్దాన్ పాల్గొన్నారు.


ఎంపికైన జట్టుతో నిర్వాహకులు

రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ


పెనుమంట్ర : బెలూన్స్ ఎగురవేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రానున్న ఎన్నికల్లో విజయం సాధించేది టిడిపినేనని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. ప్రజల దశ దిశ మార్చగలిగేది కేవలం టిడిపి ప్రభుత్వమేనని, కానున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడేనని, మాజీ హోంమంత్రి నిమ్మకాలయ చినరాజప్ప, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం, విశాఖ మాజీ ఎంఎల్ఎ బండారు సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర ఆచంట మార్కెట్ యార్డ్ నుంచి పెద్దఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీని యువ నాయకుడు పితాని వెంకట్ నేతృత్వంలో నియోజవర్గంలోని ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, అభిమానుల సహకారంతో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సిద్ధాంతం పెనుగొండ మీదుగా మార్టేరు జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు మాట్లాడుతూ అన్ని వర్గాలను జగన్మోహన్‌రెడ్డి తన మాటలతో మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలు తమ హక్కుల కోసం పోరాడితే ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచంట నియోజవర్గ అభివృద్ధి చేసిన నాయకుడు పితాని సత్యనారాయణ మాత్రమేనన్నారు. రానున్న రోజుల్లో నియోజక వర్గ ఎంఎల్ఎగా పితాని సత్యనారాయణ విజయం సాధిస్తారన్నారు. ప్రచారం కోసమే జగనన్న సురక్ష అని విమర్శించారు. వైసిపి మేనిఫెస్టో అమలు చేయకుండా పథకాల పేరుతో పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, రామరాజు, మాజీ మంత్రి జవహర్, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, అంగర రామ్మోహన్, గొల్లపల్లి సూర్యారావు, నియోజకవర్గ నాయకులు గణపతి నీడి రాంబాబు, కర్రి అచ్యుతారా మారెడ్డి, తమలంపూడి బుల్ల, గుడాల శ్రీనివాస్, కేత మీరయ్య, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సువర్ణ, సర్పంచి నక్క సోనియా వేదవ్యాస్, పిల్లి సత్తిరాజు, గంధం వెంకటరాజు, సానబోయిన గోపాల కృష్ణ, కడలి సుబ్రమణ్యం, కడలి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆచంట : టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య యాత్రను ఆచంటలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆదివారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ పసుపు రంగు బెలున్స్‌తో, పార్టీ జెండాలతో నినాదం చేస్తూ అధిక సంఖ్యలో చైతన్య రథ యాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు మోటార్‌సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ యాత్ర ఆచంట, ముల్లపర్రు, ఇల్లపర్రు, సిద్ధాంతం, వడలి, పెనుగొండ, మార్టేరుతో ముగుస్తుందన్నారు. చైతన్య రథ యాత్ర పూర్తయిన వెంటనే మార్టేరులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు బీర నరసింహమూర్తి, నెక్కంటి ప్రభాకర్, తమ్మినేడి ప్రసాద్, కేతా మురళి, మన్నే సత్యనారాయణబాబు, నాగార్జున, చిలుకూరి శ్రీను, తాళం శ్రీను, వీరస్వామి, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రామ్మోహన్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పెనుగొండ :మండలంలోని సిద్ధాంతం నుంచి పెనుగొండ మెయిన్ రోడ్డు మీదుగా మార్టేరు బహిరంగ సభ వరకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపి బస్సు యాత్ర నిర్వహించారు. సర్పంచి శ్యామల సోనియా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి బస్సు యాత్రలో పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి కళాశాలలో నేడు ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో ఈ నెల 17వ తేదీ సోమవారం ఐసిఐసిఐ బ్యాంకు వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి 26 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులందరూ అర్హులేనని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8142855722, 9985720135 సంప్రదించాలని తెలిపారు.

21 నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - కాళ్ల

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించాలని తహశీల్దార్ టిఎ.కృష్ణారావు గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో కాళ్ల మండల బిఎల్ఒలకు సమావేశం నిర్వహించారు. 21వ తేదీ నుంచి నెల రోజులు నిర్వహించే పోలింగ్ బూత్ పరిధిలో ఉన్న డోర్ టు డోర్ సర్వేలపై బిఎల్ఒలకు పలు సూచనలు చేశారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నేత సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కాంగ్రెస్ భీమవరం పట్టణ సీనియర్ నాయకులు నాచు సత్యనారాయణ (సత్యం)(86) అనారోగ్యంతో ఆయన నివాసం వద్ద ఆదివారం మృతి చెందారు. సత్యం మృతదేహానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వాసు, టిడిపి నాయకులు మెంటే పార్థసారధి, మెంటే గోపి, పలు రాజకీయ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జన సైనికుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనసేన పార్టీ జన సైనికులకు ఎప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొటికలపూడి గోవిందరావు అన్నారు. మండలంలోని చినఅమిరానికి చెందిన జన సైనికుడు సల్లపు తేజ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న రాయలం, చినఅమిరం జనసైనికులు అతనికి అండగా ఉండాలని నిర్ణయించుకుని రూ.25 వేలు కొటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్ చేతులమీదుగా సల్లపు తేజకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ జనసేన పార్టీ కష్టాల్లో ఉన్న జన సైనికులను ఎప్పుడూ ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సెక్రటరీ సుంకర రవి, నాయకులు కాళి శేఖర్, పత్తి హరివర్ధన్, శ్రీను, కొత్తవాల మహేష్, ప్రవీణ్, గణేశ్, నరేష్, రమణ, కృష్ణ పాల్గొన్నారు.

'లోకేష్‌ను విమర్శించే అర్హత మంత్రి కొట్టుకు లేదు'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నారా లోకేష్‌ను విమర్శించే అర్హత మంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో వైఎస్ఆర్ గాలిలో గెలిచావని, 1994, 1999, 2014 ఎన్నికల్లో గెలిచావా అని ప్రశ్నించారు. గురువింద గింజ మాదిరిగా మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం ప్రజలను, వ్యాపారులను మంత్రి దోచేశారని విమర్శించారు. పవన్‌పై అచ్చెన్నాయుడు లేఖ అసత్యమన్న విషయం అందరికీ తెలుసన్నారు. వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా వైసిపి నాయకులే దిష్టిబొమ్మలు దగ్ధం చేశారని, వాలంటీర్లు ఎవరూ లేరని చెప్పారు. అధికారులను తన సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్న భ్రమలో బతుకుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎవరి భవిష్యత్తు ఏంటో ప్రజలే తెలుపుతారన్నారు. ఈ సమావేశంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బాజి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్వా రైతు సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆక్వా రైతుల సంఘ సమావేశంలో పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల రైతులు పాల్గొని నూతన సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సజ్జా వీర వెంకట సత్యనారాయణ, కోడి విజయభాస్కర్, సెక్రటరీగా బోణం వెంకట నరసయ్యతో పాటు పలువురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. గాంధీభగవాన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా రైతుల సమస్యలకు ఏ ప్రభుత్వం ఇప్పటివరకు సరైన పరిష్కారం చూపలేదన్నారు. ఆక్వా ఫీడ్ ఫ్యాక్టరీలు యథేచ్ఛగా రేట్లు పెంచినా, కంపెనీలు గిట్టుబాటు ధరలు ఇవ్వకపోయినా ఇలా ఎన్ని సమస్యలు ఉన్నా రైతులను పట్టించుకోవడంలేదన్నారు. రైతులందరూ కలిసి పోరాడాలన్నారు. భవిష్యత్తులో అవసరమైతే రైతులంతా ఏకమై సొంతంగా ఫీడ్ ఫ్యాక్టరీ, ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేస్తామని, అందరూ ఒకే మాట, ఒకే బాటపై కదిలి వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.